రామలింగేశ్వరాలయంలో వైభవంగా ధ్వజపటారోహణం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24 : యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పర్వత వర్ధినీ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఆలయంలో వేదమూర్తులైన బ్రహ్మోణోత్తములతో ధ్వజపటారోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిత్యహవనం, శివపంచాక్షరీ జపం, నందీశ్వర పారాయణాలు, పంచసూక్త పఠనం, మూలమంత్ర జపములు పారాయణికులు గావించారు. డోలు వాయిద్యానికి పూజలు చేసి నాద స్వరాలపై దేవతలను ఆహ్వానించారు. సాయంత్రం పారాయణికులతో పారాయణాలు నిర్వహించి లఘు పూర్ణాహుతి కార్యక్రమం శాస్త్రోక్తంగా చేపట్టారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, శివాలయ ప్రధానార్చకుడు గౌరిభట్ల నరసింహరాములుశర్మ పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం రుద్రహవనం, రాత్రికి శివ కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

స్వర్ణగిరిలో కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణం

తిరుచ్చి వాహనంపై తిరుమాఢ వీధుల్లో విహరిస్తున్న వేంకటేశ్వరస్వామి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం వేంకటేశ్వరస్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యారాధనలు పూర్తి చేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు ద్వార తోరణ పూజ నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. ఆలయంలోని యాగశాలలో చతుస్థానార్చన మూర్తి కుంభ హోమాలు నిర్వహించారు. అనంతరం సుదర్శన ఇష్టి హవనాన్ని చేపట్టారు. ఆ తర్వాత స్వామి వారు తిరుచ్చి వాహనంపై కొలువుదీరి ఆలయ తిరు మాఢ వీధుల్లో విహరించారు. సాయంత్రం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

యాదగిరిగుట్టలో రామస్వామిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24 : పట్టణంలోని గుండ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బండ రామస్వామి అనారోగ్యంతో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం వివరాలు అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని సూచించారు. యాదగిరిపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గౌటి సదానందం భార్య లక్ష్మి మృతిచెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, నాయకులు బూడిద సురేందర్, సతీశ్ యాదవ్, శ్రీధర్‌గౌడ్, సత్యనారాయణ, యాకూబ్ ఉన్నారు.

గాయపడిన వారికి గొంగిడి మహేందర్‌రెడ్డి పరామర్శ


దవాఖానలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

మోటకొండూర్, ఫిబ్రవరి 24 : ఇటీవల కుంభమేళాకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని చాడ గ్రామానికి చెందిన పలువురు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వారిని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సోమవారం దవాఖానలో పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని చెప్పారు.

విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది ఇంటర్మీడియట్ : తాసీల్దార్

వీఆర్ కాలేజీ ఫేర్‌వెల్ డేలో మాట్లాడుతున్న తాసీల్దార్ అంజిరెడ్డి

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు భవిష్యత్‌లో ఏ స్థాయిలో స్థిరపడాలో నిర్ణయించేది ఇంటర్మీడియట్ అని తాసీల్దార్ ఎన్.అంజిరెడ్డి అన్నారు. పట్టణంలోని పద్మావతి గార్డెన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన వీఆర్ కళాశాల ఫేర్‌వెల్ డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర కీలకమన్నారు. ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీఓ కట్ట శ్రీనివాస్, యువజన అవార్డు గ్రహీత డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, కాలేజీ ప్రిన్సిపాల్ నాళం అయ్యప్ప, వైస్ ప్రిన్సిపాల్ ఉప్పలి రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చికెన్ వంటకాల కోసం ఎగబడిన జనం

- అరగంటలో 200 కిలోల పై ఖాళీ

రాజాపేటలో చికెన్ వంటకాల కోసం ఎగబడుతున్న స్థానికులు

రాజాపేట, ఫిబ్రవరి 24 : ప్రజల్లో బ్లడ్ ఫ్లూ వైరస్ భయం పోగొట్టేందుకు సోమవారం మండల కేంద్రంలో చికెన్ షాపులు, పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత చికెన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు క్వింటాళ్ల చికెన్ లెగ్ పీస్‌లు, పకోడీతోపాటు ఉడకబెట్టిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. వందల సంఖ్యలో ప్రజలు ఎగబడడంతో అరగంటలోనే చికెన్ వంటకాలు, గుడ్లు అయిపోయాయి.

తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సమక్షంలో, హైదరాబాద్ వద్ద
రిట్ పిటిషన్ నెం. 16433/2024

దిగువ తెలిపిన వారికి,
వి.రాములమ్మ, తండ్రి: వీరయ్య, ఇం.నెం. 6-56, పల్లెర్ల గ్రామం, ఆత్మకూర్ (M) మండలం.

హైదరాబాద్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సమక్షంలో ప్రతివాది నెం. 6 అయిన మీపై W.P. నెం. 16433/2024 దాఖలు చేయబడినదని తెలియజేయడమైనది. మీరు స్వయంగా / అడ్వకేట్ ద్వారా హాజరు కావాల్సిందిగా సదరు విషయం 11-03-2025కు వాయిదా వేయబడినది. లేనిచో, సదరు విషయం మీ పరోక్షంలో నిర్ణయించబడుతుంది. మీకు సమాచారం నిమిత్తం ఈ ప్రకటన జారీచేయబడినది.

న్యాయస్థాన ఉత్తర్వు ద్వారా
ఎ.ధీరజ్, అడ్వకేట్
డిజెఆర్ చాంబర్స్
నివాసం: ఫ్లాట్ నెం. 103,
ఇం.నెం.8-2-686/కె/10,
ప్రోమెనేడ్ అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం. 12,
బంజారాహిల్స్, హైదరాబాద్,
తెలంగాణ-500 034.

మోటకొండూరు వాసికి ఓయూ డాక్టరేట్

మోటకొండూర్, ఫిబ్రవరి 24 : మండల కేంద్రానికి చెందిన వంగపల్లి శ్రీనివాస్ ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగంలో డాక్టరేట్ పొందాడు. 'సోషల్ మొబిలిటీ ఆఫ్ ఫిషింగ్ కమ్యూనిటీస్ ఏ సోషియోలాజికల్ స్టడీ ఆన్ ట్రెడిషనల్ ఫిషరీస్ ఇన్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ' అంశంపై ఓయూ సీనియర్ ప్రొఫెసర్ సునంద పాండే పర్యవేక్షణలో తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఇందుకుగాను సోమవారం ఓయూలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టరేట్ పట్టా సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. డాక్టరేట్ పట్టా పొందిన శ్రీనివాస్‌ను పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ హనుమంతరావు

బొమ్మలరామారం : జడ్పీ ఉన్నత పాఠశాలలో రిజిష్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

బొమ్మలరామారం, ఫిబ్రవరి 24 : పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను కలిసి వార్షిక పరీక్షల ప్రిపరేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. 10జీపీఏ సాధించిన విద్యార్థులకు సైకిల్ బహుమతిగా అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఇష్టంతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగాలన్నారు. గణితం, సైన్స్ పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన రిజిష్టర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బీబీనగర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతరావు సోమవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

రాజకీయాల్లో పద్మశాలీలు సత్తా చాటాలి

- పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 24 : పద్మశాలీల హక్కుల సాధన కోసం, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజకీయ రంగంలో పద్మశాలీలు సత్తా చాటాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన పద్మశాలీల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 9న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలన్నారు. చట్టసభల్లో పద్మశాలీల వాణి వినిపించినప్పుడే పద్మశాలీల మనుగడ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పద్మశాలీలంతా ఏకతాటిపైకి వచ్చి కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. రాజకీయ రంగంలో మన వాటా కోసం పోరాటాలు చేసి సాధించాలన్నారు. కేసీఆర్ పోరాటాలు చేస్తేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, ఆ స్ఫూర్తితో మన హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్క వెంకటేశ్వర్లు, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం, నాయకులు బింగి వైకుంఠం, ఈడెం శ్రీనివాస్, పాశికంటి శ్రీనివాస్, చిక్క శ్రవణ్‌కుమార్, సత్యరుషి, బలరాములు, రాజు, జహంగీర్, ప్రకాశ్, శ్రీనివాస్, శ్రీధర్, అనిత, రేణుక, వెంకటేశ్, సిద్ధులు, నర్సింహులు పాల్గొన్నారు.

నేటి నుంచి 27వరకు మద్యం అమ్మకాలు బంద్ : డీసీపీ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 24 : ఈ నెల 27న జరుగనున్న వరంగల్ - ఖమ్మం - నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్‌లోని భువనగిరి జోన్ పరిధిలో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు మద్యం షాపులు, రెస్టారెంట్లు, హోటళ్లు, క్లబ్బులు, అన్ని రకాల మద్యం అమ్మకాలను నిలిపివేయాలని డీసీపీ రాజేశ్‌చంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఎక్సైజ్ చట్టం-1968, సెక్షన్ 20 ప్రకారం కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. డ్రై డే ఆదేశాలు అమలులో ఉన్న ఈ రెండ్రోజుల్లో సాధారణ మద్యం షాపులతోపాటు ఇతర రకాల మద్యం అమ్మకాలకు లైసెన్సులు పొందిన వారు ఎటువంటి అమ్మకాలు, సప్లయ్ చేయరాదని ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలను అతిక్రమించి మద్యం అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉన్నందున మద్యం అమ్మకాలు జరుగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 24 : కులగణన సర్వేలో మిగిలిన కుటుంబాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు బీసీ సోషల్ ఎకానమీ రీసర్వే విధి విధానాలను క్లుప్తంగా వివరించారు. సర్వేలో పాల్గొని కుటుంబాల వివరాలను పక్కాగా సేకరించాలన్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, వారి జీవన విధానం గురించి క్లుప్తంగా తెలుసుకోవాలని, సర్వేను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు.

సహోద్యోగి కుటుంబానికి చేయూత

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 24 : యూసుఫ్‌గూడలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రమాదానికి గురై మృతిచెందిన దోసపాటి బాలరాజు కుటుంబానికి సహచర ఉద్యోగులు బాసటగా నిలిచారు. బాలరాజు కుటుంబాన్ని సోమవారం పలువురు కానిస్టేబుళ్లు పరామర్శించి సానుభూతి తెలిపారు. వారు లక్షా 30వేల రూపాయలను జమ చేసి బాలరాజు చిన్న కూతురు శ్రావణి పేరు మీద పోస్టాఫీసులో డిపాజిట్ చేసిన పత్రాన్ని అందజేశారు. వారికి బాలరాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కానిస్టేబుళ్లు ప్రసాద్ ముదిరాజ్, స్వామి, మురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : ఇటీవల మృతిచెందిన మండలంలోని సూరేపల్లి, పచ్చర్లబోడుతండా గ్రామాలకు చెందిన కొండెం భాస్కర్, గుగులోతు శ్రీను కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ సోమవారం పరామర్శించి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. గ్రామాల్లో ఎవరికి ఎలాంటి సాయం కావాలన్నా తన వంతు సహకారం అందిస్తానన్నారు. మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేశ్, మాజీ సర్పంచులు రెడ్డినాయక్, భగవాన్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు అశోక్, ఆంజనేయులు, మైసయ్య, చందర్, సత్యనారాయణగౌడ్, శంకరయ్య, పెంటయ్య, శశికుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చిన్నకొండూరు గ్రామ కమిటీ ఎన్నిక

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 24 : బీఆర్ఎస్ చిన్నకొండూరు గ్రామ నూతన కమిటీని పార్టీ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌రెడ్డి సమక్షంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చీమకండ్ల కృష్ణ, కార్యదర్శిగా తిగుల్ల బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా చింతపల్లి వెంకట్‌రెడ్డి, మేకల శ్రీశైలం, దోర్నాల నరేశ్, బక్క స్వామి, చెక్క యాదయ్య, గడగోటి చంద్రయ్య, గరికె సాయికిరణ్ ఎన్నికయ్యారు.

ఎల్ఓసీ అందజేత

ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, ఫిబ్రవరి 24 : మండలంలోని గొల్నెపల్లి గ్రామానికి చెందిన అవుశెట్టి లక్ష్మయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.50లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాశం సత్తిరెడ్డి, గూడూరు శివశాంత్‌రెడ్డి, గంగాపురం దైవాదీనం, రాంబాబు, మధు, అంజయ్య, రాజు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటలకు పరిహారం చెల్లించాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్రారెడ్డి

మేడికుంటపల్లిలో ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

మోటకొండూర్, ఫిబ్రవరి 24 : జిల్లాలో ఎండిపోయిన వరి పంటలను సంబంధిత అధికారులు పరిశీలించి ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గిరిబోయినగూడెం గ్రామ పరిధిలోని మేడికుంటపల్లిలో ఎండిన పొలాలను రైతు సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ 5ఎకరాలు వరి నాటు పెడితే అందులో నాలుగెకరాలు నీళ్లు లేక ఎండిపోయిందన్నారు. ఫిబ్రవరిలోనే ఎండలు తీవ్రం కావడంతో జిల్లాలో చాలా గ్రామాల్లో వరి పంటలు ఎండిపోయాయని తెలిపారు. సంబంధిత అధికారులు పొలాలను పరిశీలించి ఎండిన పంటల లెక్కలు తీయాలన్నారు. రైతు భరోసా డబ్బును రైతుల ఖాతాల్లో వెంటనే వేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు పైళ్ల దయాకర్‌రెడ్డి, పీసరి మల్లారెడ్డి, నాళ్ల నరేందర్ పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలి : సీపీఎం


తుక్కాపురంలో పొట్ట దశకు వచ్చిన వరి పంటను గొర్రెలు మేస్తుండగా పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 24 : నీళ్లు లేక, విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో వరి పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తుక్కాపురంలో ఎండిపోయిన పొలాలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకుండా, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. వరి సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటలకు నష్ట పరిహారం ఇవ్వకపోతే ఆందోళనలు చేపడుతామన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకులు మారయ్య, రాములు, శ్రీశైలం ఉన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి : యాదగిరి

మోత్కూరు, ఫిబ్రవరి 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి అన్నారు. మండలంలోని పాలడుగులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ తిరిగి సమస్యలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు పెంచి ఇవ్వడంతోపాటు భూమి లేని పేదలకు రూ.12వేలు ఇస్తామని కాంగ్రెస్ మాట ఇచ్చి తప్పిందన్నారు. వేసవి ప్రారంభమైనా గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు ఇంకా పనులు కల్పించడం లేదని పేర్కొన్నారు. కూలీలకు తక్షణమే పనులు కల్పించడంతోపాటు జాబ్ కార్డులేని ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు పిట్టల చంద్రయ్య, నాయకులు సోమరాజు, లక్ష్మణ్, గంగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత ర్యాంకులు సాధించాలి

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పాపిరెడ్డి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత ర్యాంకులు సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నతంగా రాణించాలన్నారు.

చంద్రంయాదవ్ కుటుంబానికి అండగా ఉంటాం

చంద్రం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, క్యామ మల్లేశ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 24 : తెలంగాణ ఉద్యమ నాయకుడు దొడ్డమోని చంద్రంయాదవ్ మృతి పార్టీకి తీరని లోటు అని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చంద్రంయాదవ్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రం చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పైళ్ల మాట్లాడుతూ చంద్రం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కోరారు. పార్టీ అభివృద్ధికి చంద్రం శక్తివంచన లేకుండా కృషి చేశారని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సరస్వతి, వెంకటేశ్‌యాదవ్, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : వచ్చే నెల 21నుంచి ఏప్రిల్ 4వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డీఈఓ సత్యనారాయణ అధ్యక్షతన జిల్లాలోని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఎంఈఓలతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 266 పాఠశాలల నుంచి 8,631 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని, వారికోసం 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయం, కరెంటు సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సరైన సమయంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లు పూర్తి అవగాహనతో విద్యార్థుల ముందే ప్రశ్నాపత్రాలను తెరిచి వారి సంతకాలను సంబంధిత షీట్‌లో సేకరించేలా చూడాలని సూచించారు. పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థుల ఆన్సర్ షీట్లను చాలా పకడ్బందీగా ప్యాక్ చేసి సంబంధిత పోస్టాఫీసులో సమర్పించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యాశాఖ అధికారి లేదా కలెక్టర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వారోత్సవ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత - మహిళల శ్రేయస్సు అంశంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళల శ్రేయస్సుపై దృష్టి సారించి ఆర్థిక నిర్వహణలో, ఆర్థిక వ్యవస్థకు తోడ్పడటంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత ద్వారా మహిళలకు సాధికారత కల్పించడంతో మనకు, మన కుటుంబాలకు, సమాజానికి ఉజ్వలమైన భవిష్యత్‌ను అందించవచ్చన్నారు. మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడానికి, అందుబాటులో ఉన్న వివిధ ఆర్థిక వనరులు, బ్యాంకింగ్ సేవలపై మహిళలకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రమేశ్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కె.శివరామకృష్ణ, ఉపేందర్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్, స్వయం సహాయక సంఘాల ఆర్‌పీలు, కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రయోగ నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలి

- డీఈఓ సత్యనారాయణ

ల్యాబ్ పరికరాలను పరిశీలిస్తున్న డీఈఓ సత్యనారాయణ

బీబీనగర్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు ప్రయోగ నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో సుమారు రూ.15లక్షలతో ఏర్పాటు చేసిన సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మ్యాథమెటిక్స్ ల్యాబ్ ఇన్నోవేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగశాలలో ఉన్న పరికరాలను ఉపయోగించి టీచర్లు విద్యార్థులకు ప్రయోగ నైపుణ్యాలను నేర్పించాలన్నారు. ఈ ప్రయోగశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. అంతకుముందు ప్రయోగశాలలోని పరికరాలు, గణితం, ఫిజికల్ సైన్స్, భౌతిక, రసాయన, జీవశాస్త్ర మోడల్స్‌ను పరిశీలించి వాటి పని విధానాన్ని పిల్లలను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో ఎంఈఓ సురేశ్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రేమజ్యోతి, క్వాలిటీ అధికారి శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కె.విజయలక్ష్మి, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ రీజనల్ మేనేజర్ మాలిక్, ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.రమేశ్, ప్రతినిధులు షేన్, స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిలో వెదజల్లే పద్ధతిపై రైతులకు అవగాహన

కక్కిరేణి గ్రామం నుంచి క్షేత్ర సందర్శనకు వెళ్లిన రైతులు

రామన్నపేట, ఫిబ్రవరి 24 : మండలంలోని కక్కిరేణి గ్రామానికి చెందిన రైతులకు సేవాస్ఫూర్తి ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గడ్డిపల్లిలోని కేవీకేలో సోమవారం వరి వెదజల్లే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్, సేవాస్ఫూర్తి ప్రాజెక్ట్ మేనేజర్ వరి వెదజల్లే పద్ధతులపై అవగాహన కల్పించడంతోపాటు వాతావరణ మార్పులు, భూగర్భజలాలు, అకాల వర్షాలు, ఉత్పాదక ధరలు పెరుగుదల విషయాలపై సూచనలు చేశారు. అనంతరం వెదజల్లే పద్ధతిలో స్ఫూర్తినిస్తున్న గ్రామ ఆదర్శ రైతు ముక్కాముల రవిని సన్మానించారు. కార్యక్రమంలో రైతులు కన్నెబోయిన సైదులు, వెంకన్న, బెక్కంటి మహేందర్, వేముల సైదులు, మెట్టు మధు, చిల్ల వీరాంజనేయులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 24 : మండలంలోని మెహర్‌నగర్ గ్రామానికి చెందిన ఆకుల మోహన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. పోచంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరం ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన మోహన్ బాల్యమిత్రులు సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సంతాపం తెలిపారు. మోహన్ కుటుంబ సభ్యులకు రూ.40వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బాల్యమిత్రుల గ్రూప్ గౌరవాధ్యక్షుడు సురికంటి జంగారెడ్డి, గౌరవ సలహాదారుడు కాసుల నర్సింహ, అధ్యక్షుడు మైల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి యాట సత్యనారాయణ, కోశాధికారి దోర్నాల గణేశ్, మోహన్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి, నర్సింహ, పాండు పాల్గొన్నారు.